క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల వెన్నెల సూపర్ మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం ప్రవేశానికి ఈ నెల 30 లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, డీఈడీ, పై తరగతులు చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ముస్లిం మైనార్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 86391 89463, 9299458262 నంబర్లను సంప్రదించాలన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

ఈపూరు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ నాయకులు శాకమూరి బుచ్చయ్య, బోందాల శ్రీనివాసరావు మోడల్ స్కూల్ చైర్మన్ కంచర్ల పున్నయ్య, వైస్‌చైర్మన్ కనపర్తి మహేష్‌బాబులు హాజరై విద్యార్థులకు కిట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు.

నేడు కోటప్పకొండలో అభివృద్ధి పనులకు శ్రీకారం

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో రూ.కోటితో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనలు నిర్వహిస్తారని ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటప్పకొండ సమీపంలోని చిలకలూరిపేట మేజర్ కాలువ వద్ద శివ కుటుంబం, జెడ్పీ హైస్కూల్ వద్ద స్వాగత ద్వారం ఏర్పాటు పనులను పూజలు నిర్వహించి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాయితీపై బస్సు పాసులు

వినుకొండ టౌన్: ఉచిత, రాయితీపై ఆర్టీసీ బస్సు పాసులను నియోజక వర్గంలోని విద్యార్థిని విద్యార్థులకు స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌లోని కౌంటర్‌లో అందచేస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం. కోటేశ్వరరావు నాయక్ శుక్రవారం తెలియచేశారు. ఇతర వివరాలకు కౌంటర్‌కు సంబంధించిన 9959225431, 7382895527 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



వినుకొండ(నూజెండ్ల): రూరల్ పరిధిలోని శివాపురం సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొని లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మార్కాపురం డిపోకు చెందిన బస్సు వినుకొండ వైపు వస్తున్న క్రమంలో శివాపురం సమీపంలోని నడిగడ్డ జంక్షన్ వద్ద ప్రయాణీకులను దించేందుకు ఆగడంతో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణహాని లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో 108 ద్వారా వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ సాంబశివరావు, ఎస్ఐ చెన్నకేశవులతో కలిసి సంఘటనా ప్రాంతాన్ని చేరుకొని పరిశీలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు శుక్రవారం అందజేశారు. పాఠశాలకు చెందిన గీతాకృష్ణ, ఎస్‌కె హనీషా, ఎం.దాక్షాయణీలు ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000ల నగదు ప్రోత్సాహకంతోపాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయ కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, విద్యా కమిటీ చైర్మన్ పి.కాశిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా పాఠశాలల్లో చేర్పించండి..!

- ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించమంటూ వినతి
- ఈ ఏడాది నుంచి యడ్లపాడులోనే ఇంటర్ విద్య
- పది ఉత్తీర్ణులైన బాలికలు చేరాలంటూ ప్రచారం



యడ్లపాడు జెడ్పీ హైస్కూల్లో ఇంటర్ కళాశాల ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు



జగ్గాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న యడ్లపాడు జెడ్పీ హైస్కూల్ టీచర్లు

యడ్లపాడు: ప్రశాంత వాతావరణంలో విశాలమైన ప్రాంగణాన కొత్త భవనం... కార్పొరేట్ సౌకర్యాలు.. మంచి నిపుణులైన ఉపాధ్యాయులు.. అన్నింటికీ మించి ఈ ఏడాది నుంచి తమ పాఠశాలలో బాలికలకు జూనియర్ కళాశాలను ప్రారంభించామంటూ ఉపాధ్యాయులు బృందాలుగా వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. 2023–24 విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో యడ్లపాడు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు గ్రామాల్లో బృందాలుగా వెళ్లి పర్యటిస్తున్నారు. ప్రభుత్వ విద్య పథకాలు, వసతులు, పదో తరగతి పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థుల వివరాలు తెలియజేస్తున్నారు. తమ పాఠశాలలో ఉన్న నిపుణులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్య, కార్పొరేట్ వసతులు, వివిధ విద్యా పథకాల గురించి ముద్రించిన కరపత్రాల్ని పేరెంట్స్ అందిస్తూ ప్రచారం చేస్తున్నారు.

ఈ ఏడాది నుంచి ఇక్కడే ఇంటర్

యడ్లపాడు జెడ్పీ హైస్కూల్లోనే ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియేట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయభారతి వెల్లడించారు. ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్క గ్రూపునకు 40 సీట్లు ఉండగా, బోధనకు పోస్ట్‌గ్రాడ్యుయేట్ అర్హతలున్న ఏడుగురు జూనియర్ లెక్చరర్లను ప్రభుత్వం నియమించిందన్నారు. ఎలాంటి ఫీజులు లేవని, విద్య, మధ్యాహ్న భోజనం, బస్సు సౌకర్యం అన్ని ఉచితమేనన్నారు. కావున మండలం పరిధిలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలికలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్ ప్రవేశాలకు సుధీర్ సెల్: 99892 03686, కమల సెల్:90108 58676 సంప్రదించాలన్నారు.

ఎస్టీల మేలు కోసం ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలపర్తి



ఎమ్మెల్యే గోపిరెడ్డిని ఘనంగా సన్మానించిన పాలపర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: ఎస్టీల మేలుకోసం రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివారెడ్డి పేర్కొన్నారు. ఏపీ గిరిజన కో–ఆపరేటివ్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన తొమ్మిదో వార్డు మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరావు తనకు పదవి లభించటంలో కీలకపాత్ర పోషించినందుకు పలువురు నాయకులతో కలిసి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ పాలపర్తిని డైరెక్టర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల అభివృద్ధికి కృషి చేసేందుకు పాలపర్తికి అవకాశం లభించిందన్నారు. కోటప్పకొండలోని ఎస్టీ సోదరుల సత్రానికి రూ.20 లక్షలు మంజూరు చేయించామన్నారు. ప్రభుత్వం ఎస్టీల మేలు కోసం తీసుకుంటున్న నిర్ణయాల ద్వారా వారందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గిరిజనుల కోసం ఐదు ప్రదేశాల్లో సూపర్ స్పెషాల్టీ వైద్యశాలల నిర్మాణం చేపట్టిందని, గిరిజన యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారన్నారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభారవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. నియోజకవర్గంలో ఎస్టీ సోదరుడైన పాలపర్తికి డైరెక్టర్ పదవి లభించిందని, దీనిని అలంకారంగా కాకుండా ఒక బాధ్యతగా భావించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్, నరసరావుపేటలో తాను హ్యాట్రిక్ సాధించేలా విజయం సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ ఏర్పడిన దగ్గర నుంచి ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు గుర్తుపెట్టుకొని తనకు ఈ పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే గోపిరెడ్డి, సీఎం జగన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సింధుకూరి శ్రీనివాసరావు, మహిళా విభాగ రాష్ట్ర కార్యదర్శి పాలపర్తి సామ్రాజ్యం, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఎం.శేషమ్మ, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు సయ్యద్ పాతిమా, ఎనిమిదో వార్డు నాయకుడు షేక్ కరిముల్లా, చాంద్‌బాషా, దొర తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



దిశ యాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సీఐ సుధాకర్



దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు

రూరల్ సీఐ సుధాకర్

శావల్యాపురం: ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శావల్యాపురంలో దిశ నమోదు కార్యక్రమాన్ని సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు ప్రభుత్వ నిబంధనలు మేరకు రూరల్ పరిధిలో నాలుగు మండలాల్లో 4 వేల దిశ యాప్ నమోదు చేసేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టగా 2500 మంది అండ్రాయిడ్ సెల్‌ఫోన్లు నమోదు చేశామన్నారు. ప్రతి ఒక్కరు సంరక్షణ కోసం ఈ–యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. నేటి యువత చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఆయనతో పాటు ఎస్సై గల్లా రవికృష్ణ పోలీసు సిబ్బంది ఉన్నారు.

దిశ యాప్‌పై ప్రత్యేక డ్రైవ్

ఈపూరు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దిశా యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసేందుకు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని స్థానిక పోలీసులు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రజలకు దిశ యాప్ గురించి అవగాహన కల్పించి వారి ఫోన్‌లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. దిశ యాప్‌ను ఏ విధంగా వినియోగించాల్లో వారికి అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: దిశ చట్టం మహిళలకు రక్షణ కవచం వంటిందని ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపారు. శుక్రవారం దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సిబ్బందితో పాటూ మహిళా సంరక్షణ కార్యదర్శులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణపవరం సీఆర్ కళాశాల సెంటర్‌లో మహిళా సంరక్షణ కార్యదర్శులతో కలిసి ప్రజల సెల్‌ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఈ యాప్ ఆపద సమయాల్లో ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతి ఆండ్రాయిడ్ ఫోన్‌లో తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. దిశ చట్టం వచ్చాక మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఎంతో మందికి కొద్దిసమయంలోనే శిక్షలు కూడా పడ్డాయని పేర్కొన్నారు.

మహాకుంభ సంప్రోక్షణ

నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండ రోడ్డు శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి 12వ మహా కుంభాభిషేక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో నిత్యహోమం, మహాపూర్ణాహుతి నిర్వహించి ఉభయ దేవేరులతో శ్రీవారి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా పూర్ణాహుతి

నాదెండ్ల: గణపవరం శివప్రియ నగర్‌లో కొలువైయున్న శ్రీ ఆదిపరాశక్తి క్షేత్రం గండి పోచమ్మ ఆలయ తొలి వార్షికోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 10 నుండి ప్రారంభమైన వేడుకలు శనివారం మహాఅన్నదాన కార్యక్రమంతో ముగిసింది. క్షేత్రపీఠాధిపతి శ్రీ నిత్య విద్యానంద భారతీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

మాసశివరాత్రి వేడుకలు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, మాచవరం, కొత్తపల్లి, పరగటిచర్ల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం మాసశివరాత్రి వేడుకలు నిర్వహించారు. మాసశివరాత్రిని పురస్కరించుకొని స్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించారు.

అభివృద్ధికి పెద్ద పీట

చిలకలూరిపేట: మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు పెద్ద పీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని 19,20 వార్డుల పరిధిలో ముస్లిం శ్మశాన వాటిక పక్కన రూ. 34 లక్షలతో డ్రైన్ల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం శ్మశాన వాటిక పక్కన పెద్ద డ్రైన్ దశాబ్దా లుగా శిథిలావస్థకు చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సమస్యలు గుర్తించి కొత్త డ్రైన్ నిర్మాణం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే విధంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సహకారంతో పట్టణ పరిధిలో అవసరమైన చోట్ల అభివృద్ధి పనులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఏఈఈ జ్యోతి, కౌన్సిలర్లు షేక్ నసిమా బేగం, బేరింగ్ మౌలాలి, వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ బషీర్ మేస్త్రి, పఠాన్ తలహాఖాన్, పఠాన్ పెద్ద షబ్బీర్, చిన్న షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ వైఖరి విడనాడాలి

నరసరావుపేట: డిపోలో అన్నికేటగిరీల ఉద్యోగులపై యాజమాన్యం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి విడనాడాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం డిపో ముందు డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎర్రబ్యాడ్జీలు ధరించిన ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి షేక్ జాని మాట్లాడుతూ ఏడీసీలపై కక్ష సాధింపు చర్యలు నిలుపుదల చేయాలన్నారు.

ఖబరస్థాన్ అభివృద్ధి పనులకు శ్రీకారం

మంత్రి రజినికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ముస్లిం పెద్దలు



ప్రార్థన నిర్వహిస్తున్న ముస్లింలు

చిలకలూరిపేట: ముస్లిం ఖబరస్థాన్ (శ్మశానవాటిక) అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ముందుగా ఖబరస్థాన్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఎంతో కాలంగా శ్మశానవాటిక స్థలం విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గుర్తించి తన సొంత నిధులు రూ. 1.01 కోట్లు వెచ్చించి వేలూరు రోడ్డులో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఇటీవల చిలకలూరిపేటకు విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరో మూడు ఎకరాల భూమి ప్రభుత్వం తరపున కొనుగోలు చేసి ఇస్తామని హామీ ఇవ్వడం పట్ల సీఎంకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఖబరస్థాన్ అభివృద్ధిలో ముస్లింలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఖబరస్థాన్ కమిటీ సభ్యులు సయ్యద్ బషీర్ మేస్త్రి, మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ నద్వి, అంజుమన్ ఇస్లామియా అధ్యక్షుడు షేక్ జానీబాసాహెబ్, ముఫ్తీ అనస్‌ఖాన్, ముస్లిం పెద్దలు వేటపాలెం సుభాని, బేరింగ్ మౌలాలి, సయ్యద్ బడే, షేక్ ఖాలిద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేటలో వృద్ధుడి అనుమానాస్పద మృతి

- రెండవ భార్య కుమారుడే హతమార్చాడంటూ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు



మృతదేహం వద్ద రోదిస్తున్న ఏసమ్మ

నరసరావుపేట టౌన్: అనుమానాస్పదంగా ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. అతని మృతికి రెండవ భార్య కుమారుడే కారణమని ఆరోపిస్తూ మొదటి భార్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కంభంపాలెంకు చెందిన మందా ఏసురత్నం (65) గతంలో సైకిల్ షాపు పెట్టుకుని జీవనం చేసేవాడు. భార్య ఏసమ్మ భర్తతో విభేధాలు వచ్చి 30 ఏళ్ల క్రితం అలిగి రావిపాడులోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాకపోవటంతో ఏసురత్నం నాగేంద్రమ్మను రెండవ పెళ్లి చేసుకున్నారు. వీరికి నలుగురు సంతానం ఉన్నారు. ఏసురత్నం అనారోగ్యానికి గురికావడంతో ఏడాది క్రితం భర్తను విడిచి నాగేంద్రమ్మ వెళ్లిపోయింది. ఈ క్రమంలో 5 నెలల క్రితం మొదటి భార్య ఏసమ్మ వచ్చి ఏసురత్నం బాగోగులు చూసుకుంటోంది. అయితే ఆస్తిని మొదటి భార్యకు రాసిస్తాడేమన్న అనుమానంతో రెండవ భార్య పెద్దకొడుకు నవీన్ తరుచూ తండ్రి ఏసురత్నంతో గొడవ పడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లాలని తండ్రిపై దాడి చేశాడు.

ఏసురత్నం అతని మొదటి భార్య ఏసమ్మ అర్ధరాత్రి ఆసుపత్రికి వెళ్తుండగా శారదాంబ థియేటర్ సమీపంలో వారిని అడ్డగించి తండ్రిను నెట్టాడు. అతను క్రింద పడగా భయంతో ఏసమ్మ పరుగులు తీసింది. దీంతో అక్కడ నుంచి నవీన్ వెళ్లిపోయాడు. శుక్రవారం తెల్లవారుజామున ఏసురత్నం పడిపోయిన స్థానంలోనే అపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానికులు గమనించి అతన్ని ఆటోలో ఇంటికి తరలించారు. విషయం తెలుసుకున్న మొదటి భార్య వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి కణితిపై బలమైన గాయం ఉన్నట్లు గుర్తించారు. రెండవ భార్య కుమారుడు దాడి చేయటం వల్లే తన భర్త మృతి చెందాడని మొదటి భార్య ఏసమ్మ పోలీసులకు వివరించి ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత హత్య లేక అనుమానస్పద మృతి అనేది తేలుతుందన్నారు.

పౌష్టికాహార పంపిణీలో ఏపీ టాప్



మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

నాదెండ్ల: చిన్నారులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీలో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యులు బత్తుల పద్మావతి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో బాలల భవితకు భాగస్వామ్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఎనిమిదేళ్ళలోపు విద్యార్థులను ఎలాంటి ఆధార్, రేషన్‌కార్డు లేకుండా పాఠశాలల్లో చేర్చుకోవాలన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని అంగన్‌వాడీల్లో తప్పనిసరిగా చేర్పి పూర్వ ప్రాథమిక విద్య నేర్పించాలన్నారు. ఐదేళ్లు నిండిన బాలలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకం ఏర్పడటంతో గణనీయంగా సంఖ్య పెరిగిందన్నారు. బాల్యవివాహాలు జరగకుండా, బాలికలు చక్కగా చదువుకుని ఉన్నతంగా రాణించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలు జరిగినట్లయితే తమకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ అరుణ, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, సీడీపీవో శాంతకుమారి, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీటీసీ యల్లారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని బీఆర్‌ఐజీ మున్సిపల్ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్, ఇంగ్లిషు–తెలుగు డిక్షనరి పంపిణీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ విద్యారంగానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారని చెప్పారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా అమ్మఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న కానుక, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరిందని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, కొమరవల్లిపాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, యాదల సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో గృహ, వాణిజ్య, చిన్నతరహా, వ్యవసాయ, పరిశ్రమలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత పునరుద్ధరణ ఉంటుందని తెలిపారు.

నేడు వేల్పూరులో రచ్చబండ కార్యక్రమం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ పరిధిలో నియోజకవర్గస్థాయిలో రచ్చబండ కార్యక్రమం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవం చేస్తున్నట్లు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో ఎంపీపీ రచ్చబండ కార్యాక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ఏదుట ప్రాంగణంలో వేదిక ఏర్పాటు చేశామని ప్రజాప్రతినిధులు అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈసదస్సులో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య,డిప్యూటీ తహసీల్దారు పి.నాసరయ్య, ఏఈ గాంధీ, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ,వేల్పూరు గ్రామసర్పంచ్ రంతు శ్రీనివాసరావు, వీఆర్వో చందా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- గోనుగుంట్లవారిపాలెంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. గోనుగుంట్లవారి పాలెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు తో కలసి గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే బొల్లా మాజీ ఎమ్మెల్యే మక్కెన గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం గారమంలో గడపగడపకూ తిరిగి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రచారం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను దగ్గర చేయడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు.

రూ.6.40 కోట్లతో సమస్యల పరిష్కారం

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం రూ.6.40 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం రామిరెడ్డి పేటలోని 22, 24 వార్డుల్లో పలు అభివృద్ధి పనులైన డ్రెయిన్లు, సీసీరోడ్లు, పైపులైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ మొత్తం 34 వార్డుల్లో 32 వార్డుల్లో గడపగడప కార్యక్రమం పూర్తి చేశామన్నారు. 24వ వార్డులోని మసీదు పక్కగా రూ.13 లక్షలతో కల్వర్టు, డ్రెయిన్ నిర్మాణం చేపట్టామన్నారు. ఎంప్లాయిస్ కాలనీలో రూ.16 లక్షలతో రెండు సీసీరోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆయేషా ఖాజావలి,సానికొమ్ము సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.